


RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక




సంపుటి : 2 సంచిక : 359 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 29 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 359 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 29 December 2025 PAGES : 8 PRICE : 3/-

## 2025లో భారత్ గర్వించదగిన క్షణాలివే ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 28)

'మన్‌కీ బాత్' కార్యక్రమం 129వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఇందులో భాగంగా 2025లో భారతదేశం గర్వించదగిన క్షణాలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ ప్రపంచ దేశాలకు తన బలాన్ని చూపించిందని.. దేశ భద్రతపట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. దేశంలోని ప్రతిపౌరుడికి ఈ ఆపరేషన్ గర్వకారణంగా మారిందన్నారు. 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు కూడా దేశ ప్రజల్లో ఇదే స్ఫూర్తి కనిపించిందని పేర్కొన్నారు. క్రీడల పరంగా కూడా ఈ ఏడాది చిరస్మరణీయమని మోదీ పేర్కొన్నారు. 12 ఏళ్ల తర్వాత టీమ్‌ఇండియా పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుందని.. మహిళల క్రికెట్ జట్టు మొదటిసారి వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుందన్నారు. మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకొని చరిత్ర సృష్టించిందని గుర్తు చేసుకున్నారు. అంతరిక్ష రంగంలోనూ ఈ ఏడాది భారత్ తన ప్రతిభను చాటుకుందని అన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శుభాన్షు శుక్లాను ప్రశంసించారు.కోట్ల మంది పాల్గొన్న మహా కుంభమేళా ను భారత్ దిగ్విజయంగా నిర్వహించి, ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరిచిందని మోదీ పేర్కొన్నారు. అయోధ్య రామాలయంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమంప్రతి హిందువు గర్వపడేలా చేసిందని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలు, ఇతర విషయాలను గుర్తు చేసుకున్నారు. 2025లో దేశ ప్రజలు ఏ విధంగా ఐక్యతతో, -మిగతా 2లో

# సర్దుబాటే మంత్రం

**మదనపల్లె జిల్లా ఏర్పాటుతో అన్నమయ్యలో మిగిలేవి 3 నియోజకవర్గాలే**
**వైఎస్సార్ కడపలోకి రాజంపేట, తిరుపతిలోకి రైల్వేకోడూరు, మదనపల్లెలోకి రాయచోటి**
**అలా సర్దకపోతే కష్టం - సీఎం దృష్టికి తీసుకెళ్లిన అధికారులు**
**నేడు తుది నిర్ణయం**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 28)

జిల్లాలు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

జిల్లాల పునర్విభజనలో పీటముడి పడింది. నాలుగు నియోజకవర్గాల్లోని 19 మండలాలతో మదనపల్లె జిల్లా ఏర్పాటు తర్వాత.. ప్రస్తుత అన్నమయ్య జిల్లా మూడు నియోజకవర్గాలతో రాష్ట్రంలో చిన్న జిల్లాగా మిగులుతోంది. శనివారం సీఎం చంద్రబాబు వద్ద జిల్లాల పునర్విభజనపై జరిగిన సమావేశంలో దీనిపై చర్చ జరిగింది. ప్రత్యేక జిల్లాగా కొనసాగించలేని పరిస్థితి, చిన్న జిల్లాల కారణంగా ఇప్పటికే తెలంగాణలో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. రాజంపేట నియోజకవర్గాన్ని వైఎస్సార్ కడపలో, రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో, రాయచోటిని కొత్తగా ఏర్పాటు చేసే మదనపల్లె జిల్లాలో కలిపేందుకు ఉన్న అవకాశాల్ని పరిశీలించాలని అధికారులు ప్రతిపాదించారు.దీనిపై ప్రాంతాల వారీగా దూరాలతో సమగ్ర నివేదిక తయారు చేయాలని సీఎం సూచించారు. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లలో మార్పుచేర్పులకు సంబంధించి ప్రభుత్వం గత నెల 27న ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చింది. నెల రోజులపాటు అభ్యంతరాలు స్వీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 927 అభ్యంతరాలపై సీఎం, మంత్రులు, అధికారులు శనివారం చర్చించారు. కొన్నిచోట్ల మార్పుచేర్పులు సూచించారు. వీటన్నింటిపై ఆదివారం మరోసారి సమగ్రంగా చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నారు. 29న మంత్రివర్గ సమావేశంలో ఆమోదించి, 31న తుది నోటిఫికేషన్ జారీ చేస్తారు.

### గ్రేటర్ల ఏర్పాటుకు సమయం చాలదు

గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతిల ఏర్పాటుపై అధికారులు సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. వీటి ఏర్పాటుకు సీఎం చంద్రబాబు కూడా సానుకూలత వెలిబుచ్చారు. అయితే జనగణన నేపథ్యంలో ఏర్పాటుకు సరిపడా సమయం కూడా లేదు. ఇందులో కలిపేందుకు ప్రతిపాదించిన పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం 2026 ఫిబ్రవరి వరకు ఉంది. వారి నుంచి తీర్మానాలు కూడా రావాలి. అందుకూ సమయం చాలదు. దీంతో తాత్కాలికంగా పక్కన పెట్టాలని.. జనగణన పూర్తయ్యాకే చేపట్టాలని సీఎం సూచించారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే గూడూరు ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా ఆ నియోజకవర్గంలోని 5 మండలాల్ని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కలపాలని సీఎం స్పష్టం చేశారు. ఆదోని మండలాన్ని ఆదోని, పెద్దహరివాణం మండలాలుగా విభజించనున్నారు. మండల కేంద్రం తమకు దూరంగా ఉంటుందని ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొత్తగా ఏర్పాటయ్యే మండల కేంద్రం కూడా ఆదోనిలోనే ఉంటుంది. అంటే రెండు మండల కేంద్రాలు ఆదోనిలోనే ఉంటాయి. అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి సబ్‌డివిజన్ -మిగతా 2లో

## ఆపరేషన్ సిందూర్ తో తీవ్రంగా భయపడిన పాక్... అందుకు ఇదే నిదర్శనం!

**'ఆపరేషన్ సింధూర్' వేళ బంకర్‌లోకి వెళ్లమన్నారని అంగీకరించిన పాక్ అధ్యక్షుడు జర్దారీ**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 28)

భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్ ఉన్నత నాయకత్వాన్ని ఎంతగా భయపెట్టిందో స్వయంగా ఆ దేశ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ మాటల్లోనే వెల్లడైంది. ఆపరేషన్ సమయంలో తనను బంకర్‌లోకి వెళ్లి దాక్కోవాలని సైన్యం సూచించిందని ఆయన అంగీకరించారు. ఈ వ్యాఖ్యలతో భారత దాడుల తీవ్రత ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.

ఇటీవల ఓ బహిరంగ సభలో జర్దారీ మాట్లాడుతూ, "నా మిలటరీ సెక్రటరీ నా వద్దకు వచ్చి, 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ దాడులు చేస్తోంది, యుద్ధం ప్రారంభమైంది, మనం బంకర్‌లోకి వెళదాం' అని సూచించాడు" అని తెలిపారు. అయితే, తాను ఆ సూచనను తిరస్కరించానని, "నాయకులు యుద్ధభూమిలోనే ప్రాణాలు విడుస్తారు కానీ, బంకర్లలో కూర్చుని చనిపోరు" అని ధీమాగా చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా మే 7న భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలు, సైనిక స్థావరాలపై బ్రహ్మోస్ వంటి అత్యాధునిక క్షిపణులతో విరుచుకుపడింది. కనీవినీ ఎరుగని రీతిలో భీకరదాడులు చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. భారత్ దాడుల తీవ్రతకు పాక్ అధ్యక్ష భవనం సైతం వణికిపోయిందనడానికి జర్దారీ వ్యాఖ్యలే నిదర్శనం. ఉగ్రవాదంపై భారత్ తీసుకుంటున్న కఠిన వైఖరి పాకిస్థాన్‌ను ఏ స్థాయిలో కలవరానికి గురిచేసిందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

## విద్య ఒక్కటే అభివృద్ధికి రాజమార్గం



### కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 28)

విద్య ఒక్కటే అభివృద్ధికి రాజమార్గమని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మన దేశానికి గుర్తింపు, కీర్తి ప్రతిష్ఠలు తెచ్చే విద్య, క్రీడలపై యువత ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పెదమైనవానిలంకలో ఆమె పర్యటించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన రూ.18 లక్షల విలువైన కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్ తదితర మౌలిక సదుపాయాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడారు. తీరప్రాంత యువత ఉన్నత చదువులు చదివి దేశానికి, రాష్ట్రానికి మంచి సేవలు అందించాలని నిర్మలా సీతారామన్ కోరారు. తీర ప్రాంతానికి ఏం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని.. విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. మంచి ఆలోచనలతో ముందుకెళ్తూ.. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, భాజపా -మిగతా 2లో

## జనవరి 3న కొండగట్టు అంజన్న ఆలయానికి పవన్ కల్యాణ్

**ఆలయం వద్ద భారీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్న పవన్ కల్యాణ్**
**దీక్షా విరమణ మండపం, భారీ సత్రాల నిర్మాణాలకు భూమిపూజ చేయనున్న పవన్**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 28)



తెలంగాణలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరలో సందర్శించనున్నారు. 2026 జనవరి 3వ తేదీ శనివారం ఆయన కొండగట్టును సందర్శించనుండటంతో ఈ పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మికంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.ఈ పర్యటన సందర్భంగా ఆలయ అభివృద్ధికి సంబంధించి కీలక కార్యక్రమాల్లో పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు ఆధ్వర్యంలో కొండగట్టు అంజన్న భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న భారీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ప్రధానంగా హనుమాన్ దీక్షలు చేపట్టే వేలాది మంది భక్తులకు ఉపయోగపడే -మిగతా 2లో

## నరేగా ప్రారంభించిన గ్రామంలో ఆందోళన నిర్వహించండి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 28)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళనను ఉమ్మడి అనంతపురం జిల్లా బండ్లపల్లిలోనూ నిర్వహించాలని ఏపీసీసీ నాయకులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజులు శనివారం దిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పార్టీ అగ్రనేతలకు విజ్ఞప్తిచేశారు. 'ఉపాధి' చట్టం చేశాక బండ్లపల్లి గ్రామం నుంచి పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. ఇప్పుడు పథకాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ జనవరి 5 నుంచి దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించిన నేపథ్యంలో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను ఆ గ్రామానికి ఆహ్వానించినట్లు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు విలేకర్లకు చెప్పారు. "కేంద్ర ప్రభుత్వం ఒక పథకం -మిగతా 2లో



## మోదీ పాలనలో విశ్వవిజేతగా భారత్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 28)

ప్రధాని నరేంద్రమోదీ పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో విశ్వవిజేతగా ఎదుగుతోందని.. విద్యార్థులు, యువత అభివృద్ధే ధ్యేయంగా దేశంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతి వేదికగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఏడో భారతీయ విజ్ఞాన సమ్మేళనం రెండోరోజు శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఒకనాడు భారత్ అంటే చిన్నచూపు ఉండేదని, విదేశీయుల పాలనలో అణచివేతకు గురైన భారతావని.. మోదీ ప్రధాని అయ్యాక విశ్వగురువుగా అంతర్జాతీయ స్థాయిలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో విజయాలు సాధించడమే కాక.. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌ను దెబ్బతీసి.. భారతీయ రాడార్ వ్యవస్థ ఘనతను -మిగతా 2లో





## ఆరెస్సెస్‌లో మహిళలకు స్థానం ఎక్కడ?

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 28)

ఆరెస్సెస్‌లో మహిళలకు స్థానం ఎక్కడుందని సినీనటుడు ప్రకాష్‌రాజ్ ప్రశ్నించారు. విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం సాయంత్రం సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభలు -మిగతా 2లో

# కలుజువ్వలపాడు కేజీబీవీ తనిఖీ







**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 28)**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం కేజీబీవీ తర్లుపాడు (కలుజువ్వలపాడు)ని తనిఖీ చేసి విద్యార్థులతో విడివిడిగా, ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో కూడా మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. స్కూల్ నిర్వహణ, విద్యార్థుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని సమగ్ర శిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి హెచ్చరించారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, ఇన్‌స్టిట్యూషన్ వన్ ఆఫీసర్ ఇంచార్జ్ జ్యోత్స్న కుమారి, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# సర్దుబాటే మంత్రం

బదులుగా అడ్డరోడ్డు జంక్షన్ పేరుతో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్‌లో, అచ్యుతాపురం మండలాన్ని అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్‌లో చేర్చాలని నిర్ణయించారు. రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటయ్యే జిల్లాలో ఎలాంటి మార్పుచేర్పులు లేవు. మార్కాపురం జిల్లాలోకి దొనకొండ, కురిచేడు.. ప్రకాశంలోకి పొదిలి దర్శి నియోజకవర్గంలోని దొనకొండ, కురిచేడు మండలాల్ని కొత్తగా ఏర్పాటయ్యే మార్కాపురం జిల్లాలో, మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మండలాన్ని ప్రకాశం జిల్లాలో కలపనున్నారు.

కందుకూరు డివిజన్‌లోని ఐదు మండలాల్ని ప్రకాశం జిల్లాకు మారుస్తారు. ఇప్పటి వరకు ఈ డివిజన్‌లో ఉన్న వరికుంటపాడు, కొండాపురం మండలాల్ని కావలి డివిజన్‌లో చేరుస్తారు. కనిగిరి డివిజన్‌లోని మర్రిపాడు, పొన్నలూరు మండలాల్ని కూడా కందుకూరు డివిజన్‌లో చేరుస్తారు.

అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతోపాటు ఆ డివిజన్‌లోకి అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు మండలాల్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తారు. శ్రీకాకుళం జిల్లాలోని నందిగం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి రెవెన్యూ డివిజన్‌కు మారుస్తారు. అనకాపల్లి జిల్లాలోని చీడికాడ మండలాన్ని నర్సీపట్నం డివిజన్ నుంచి అనకాపల్లి డివిజన్‌లో చేరుస్తారు. కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లోకి తెస్తారు.

చిత్తూరు జిల్లా పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు డివిజన్‌కు, చౌడేపల్లి, పుంగనూరు మండలాల్ని మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోకి మారుస్తారు. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని సదుం, సోమల మండలాల్ని మదనపల్లె జిల్లాలోని పీలేరు రెవెన్యూ డివిజన్‌లో కలుపుతారు. శ్రీసత్యసాయి జిల్లాలో కొత్తగా మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తారు. కదిరి రెవెన్యూ డివిజన్‌లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తారు. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని నిర్ణయించారు.

# మోదీ పాలనలో విశ్వవిజేతగా భారత్

ప్రపంచానికి చాటి చెప్పామని వివరించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సాంకేతికతను ఉపయోగించుకొని మేధస్సును పెంచుకోవాలే తప్ప దురలవాట్లకు లోను కారాదని సూచించారు. రాష్ట్రంలో ఆర్థిక వనరులు ఎలా ఉన్నా.. అభివృద్ధి అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా శ్రమిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా కౌశల్ 2025 పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి విజేతలుగా నిలిచినవారికి మంత్రి బహుమతులు, ప్రశంసాపత్రాలు, పారితోషికాలు అందజేశారు.

# ఆరెస్సెస్‌లో మహిళలకు స్థానం ఎక్కడ?

ప్రారంభమయ్యాయి. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని సినీనటులు ప్రకాశ్‌రాజ్ నగారా మోగించి ప్రారంభించారు. అక్కడ, అంతకుముందు విలేకర్లతోనూ ఆయన మాట్లాడారు. "దేశంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వాలు ప్రభుత్వరంగ సంస్థల్ని నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నాయి. ఆరెస్సెస్‌లో ఒక్క స్వాతంత్ర్య సమరయోధుడైనా ఉన్నారా? మావోయిస్టుల భావజాలం వేరైనంత మాత్రాన ఎన్‌కౌంటర్లు చేసి చంపేస్తారా? వేదికలపై మాట్లాడేవాళ్లు జాగ్రత్తగా మాట్లాడాలి. నటుడు శివాజీ వ్యాఖ్యలు తప్పే. ఆడవాళ్లకు మగవాళ్ల వల్లే అన్యాయం జరుగుతోంది. అనసూయకు మద్దతు ప్రకటిస్తున్నా. ఐ బొమ్మ రవి చేసింది దొంగతనమే అవుతుంది. అయినా టికెట్ ధరలు పెరిగితే ప్రేక్షకులే సినిమాలు చూడడం మానేయాలి. విమానాశ్రయాలు మారుతున్నాయంటున్నారు కానీ చేయి మారుతున్నాయనే విషయం గమనించాలి. ఒకప్పుడు రాజకీయ నాయకులు పదవులు దక్కించుకోవడానికి రౌడీలను పెంచిపోషించేవారు. ఇప్పుడు కార్పొరేట్లు చెప్పినట్లు వింటున్నారు" అని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో జరగని సీఐటీయూ అఖిల భారత మహాసభలు విశాఖ వేదికగా జరుగుతున్నాయన్నారు. ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతోందన్నారు. అంతకుముందు పుస్తక ప్రదర్శనను ఆచార్య వెలమల సిమ్మన్న, ఫొటో ఎగ్జిబిషన్‌ను స్టార్‌మేకర్ సత్యానంద్ ప్రారంభించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, బేబీరాణి, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, పాత్రికేయుడు తెలకపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# 2025లో భారత్ గర్వించదగిన క్షణాలివే: ప్రధాని మోదీ

సామరస్యంగా ఉన్నారో అదే విధంగా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

**మోదీ నోట నరసాపురం లేస్ క్రాఫ్ట్ మాట..**

మన్‌కీబాత్‌లో ప్రధాని మాట్లాడుతూ నరసాపురం లేస్ క్రాఫ్ట్ గురించి ప్రస్తావించారు. ప్రస్తుత మార్కెట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లేస్ క్రాఫ్ట్ చర్చనీయాంశంగా మారిందన్నారు. తరతరాల నుంచి మహిళలే ఈ అరుదైన కళను కాపాడుతూ వస్తున్నారన్నారు. ఏపీ ప్రభుత్వం నాబార్డ్‌తో కలిసి లేస్ క్రాఫ్ట్ కళాకారులకు కొత్త డిజైన్లు, నైపుణ్యాలు నేర్పిస్తోందని.. ప్రస్తుతం దీని మార్కెట్ వేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రభుత్వ మద్దతుతో నరసాపురం ప్రజలు ఈ కళకు కొత్త హంగులను చేర్చి ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. లక్షలమంది మహిళలు ఉపాధి పొందుతున్న ఈ కళకు జీఐ గుర్తింపు కూడా ఉందన్నారు.

# విద్య ఒక్కటే అభివృద్ధికి రాజమార్గం

రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ నిర్వహించిన 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని నిర్మలా సీతారామన్, ఇతర నేతలు, అధికారులు వీక్షించారు.

# జనవరి 3న కొండగట్టు అంజన్న ఆలయానికి పవన్ కల్యాణ్

విధంగా దీక్షా విరమణ మండపం, ఆధునిక వసతులతో కూడిన సత్రం నిర్మాణానికి పవన్ కల్యాణ్ భూమిపూజ చేయనున్నారు. ఈ అభివృద్ధి పనులను టీటీడీ బోర్డు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. సుమారు రూ.35.19 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టులు అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్షా విరమణ చేసేలా విశాలమైన మండపాన్ని నిర్మించనున్నారు. అలాగే, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం 96 గదులతో కూడిన భారీ సత్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ నిర్మాణాలు కొండగట్టు ఆలయ చరిత్రలో భక్తుల సౌకర్యాల పరంగా కీలక మైలురాయిగా నిలవనున్నాయి. పవన్ కల్యాణ్ తన రాజకీయ ప్రస్థానంలో కీలక నిర్ణయాల ముందు కొండగట్టు అంజన్నను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో కొండగట్టు అంజన్నను దర్శించుకున్న సమయంలో పవన్ కల్యాణ్ కు భక్తులు సమస్యలు విన్నవించారు. ఆ నేపథ్యంలో టీటీడీ నిధుల ద్వారా ఇక్కడ సౌకర్యాల ఏర్పాటునకు హామీ ఇచ్చారు. టీటీడీ ద్వారా పవన్ నిధులు మంజూరు చేయించారు. ఇప్పుడు ఏపీ ఉపముఖ్యమంత్రి హోదాలో, టీటీడీ భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమానికి ఆయన హాజరవడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. పవన్ కల్యాణ్ పర్యటనను దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, జనసేన కార్యకర్తలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో జగిత్యాల జిల్లా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారు.

# నరేగా ప్రారంభించిన గ్రామంలో ఆందోళన నిర్వహించండి

ప్రకారం పేదలకు పని హక్కును దూరం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ చేపట్టే ఆందోళనతో మోదీ ప్రభుత్వం దిగిరాక తప్పదు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ జనవరి 5 నుంచి ఉద్యమాన్ని చేపట్టబోతోంది" అని ఆయన ప్రకటించారు.

# గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా విస్తృత తనిఖీలు

**రైళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టిన పోలీసులు**

**రైలులో సుమారు 11.5 కిలోల గంజాయి,**

**37 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్న జిల్లా పోలీసులు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)**

గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా, ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు పర్యవేక్షణలో ఒంగోలు రైల్వే స్టేషన్‌తో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ, ఈగిల్ టీం మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని, మాదకద్రవ్యాలను గుర్తించే జాగిలం రాక్సీతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్సెల్ కార్యాలయాలు తదితర ప్రదేశాలను సమగ్రంగా పరిశీలించారు. అదేవిధంగా, అనుమానాస్పదంగా కనిపించిన పార్సిళ్లు, ప్రయాణికుల బ్యాగులు మరియు ఇతర వస్తువులను ఒక్కొక్కటిగా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలప్పుజా ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు నుంచి సింగరాయకొండ వరకు పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 11.5 కిలోల గంజాయి, 37 చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆషి, సత్యనాథపురం, నాగపట్నం జిల్లా, తమిళనాడు. రంజిత్ బుడెక్, సునాబహల్, బలాంగీర్ జిల్లా, ఒడిశా. బసుదేవ్ బోడక్, సునా దహల్, మల్కన్‌గిరి జిల్లా, ఒడిశా. లోకేంద్ర బ్యూరే, సవల్ గ్రామం, బలాంగీర్ జిల్లా, ఒడిశా. ఈ నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం జి.ఆర్.పి పోలీసులకు అప్పగించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసే, విక్రయించే, వినియోగించే వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266 కు తెలియజేయవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు తెలియజేశారు. ఈ తనిఖీలో మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుధాకర్, ఎస్ఐలు శివరామయ్య, సుదర్శన్, మధుసూధనరావు, ఈగల్ టీం సిబ్బంది, డాగ్ హ్యాండ్లర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

# అప్సా ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్ట్ ఓరియెంటేషన్ తరగతులు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)**

ఒంగోలు టౌన్ ఏపీటీసీఏ (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్, కాన్వెంట్స్ అసోసియేషన్), అప్సా ఆధ్వర్యంలో 2025-2026 సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు నగరంలోని వల్లూరు వద్ద గల రైజ్ కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నందు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే అన్ని సబ్జెక్టుల్లో పూర్తి స్థాయిలో ఉత్తీర్ణత, ప్రతి సబ్జెక్ట్‌లో తేలికైన పద్ధతులు ద్వారా ఎలా 100 కి 100 మార్కులు తెచ్చుకోవడం కోసం మెళుకువలు నేర్పేలా అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే 10వ తరగతి విద్యార్థులకు "ఎఎయిమ్ హై " పేరిట విషయ అవగాహన తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పూర్వ జిల్లా అధ్యక్షులు పిడుగు జాలి రెడ్డి ప్రారంభిస్తూ గత ఏడాది నిర్వహించిన ఇదే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్దులు రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో టాపర్లు గా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 500 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందని, ఈ విషయ అవగాహన తరగతులు ( ఇంగ్లీష్, హిందీ, ఫిజిక్స్, బయాలజీ, మ్యాథ్స్ , సోషల్ సబ్జెక్ట్స్) నిర్వహించడం ద్వారా విద్యార్థులు సరైన మెళుకువలు నేర్చుకుని 2026లో జరిగే 10 వ తరగతి పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధిస్తారని, ఇలాంటి కార్యక్రమం విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుందని , 500 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఎపిటిసిఏ నగర అధ్యక్షురాలు ఈవియస్ లక్ష్మి ( చందమామ శ్రీవాణి విద్యా నికేతన్ స్కూల్) అన్నారు. ఈ కార్యక్రమంలో మాంటిస్సోరి ప్రకాష్ బాబు, మాజీ జిల్లా ఏఏపీటీసీఏ అధ్యక్షులు పిడుగు జాలి రెడ్డి, ఏపీటీసీఏ జిల్లా అధ్యక్షులు గేరా అజయ్ , ఆంధ్రా స్కూల్ శ్రీను, అపెక్స్ షేక్ భాషా, లిటిల్ హార్ట్స్ ఆత్మకూరి బ్రహ్మయ్య, శ్రీరామ్ స్కూల్ శ్రీరాములు రెడ్డి , యేసుపాదం , సెక్రటరీ శ్రీను, ట్రెజర్ శ్రీను, శ్యామ్, ప్రజ్ఞా సుబ్బారావు, జమీర్ , గీతాంజలి శ్రీను, ట్రైనర్లు , కరెస్పాండెంట్ మిత్రులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సహకరించిన రైజ్ కాలేజీ యాజమాన్యం సిద్దా భరత్ కి పట్టణ ఏపీటీసీఏ అధ్యక్షురాలు ఈవియస్ లక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు మా కళాశాల ఎప్పుడు మా వైపు నుంచి సంపూర్ణ సహాయ , సహకారాలు అందిస్తామని రైజ్ కాలేజీ ఛైర్మన్ సిద్దా భరత్ తెలిపారు.





షణ్ముఖ వెలుగు

ePaper
www.shanmukhavelugu.com

3 | 29.12.25
సోమవారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

ప్రకాశం



# కనిగిరికి రైలు వచ్చింది

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిసెంబర్ 28)

ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేరుతోంది. ఎన్నికల సమయంలో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను పూర్తి చేసి రైలు నడుపుతామని నాయకులు దశాబ్దాలుగా హామీలు గుప్పించారు. కానీ ఆ హామీలు ఇప్పటికి కార్యరూపం దాల్చే పరిస్థితి ఏర్పడడంతో కనిగిరి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల యడవల్లి వరకు వచ్చిన రైలు ఆదివారం కనిగిరి స్టేషన్ కు రావడంతో ప్రజలు రైల్వే స్టేషన్‌లో కేరింతలు కొట్టి ఆనందం వ్యక్తపరిచారు. సోషల్ మీడియాలో కనిగిరికి రైలు వచ్చిందంటూ విస్తృత ప్రచారం నిర్వహించారు.

# వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

**ప్రతి ఒక్క బుల్లెట్ లక్ష్యాన్ని ఖచ్చితంగా చేదించే నైపుణ్యం పొందాలి**

**అత్యవసర పరిస్థితుల్లో ప్రజల, ప్రభుత్వ ఆస్తుల, ప్రాణాల రక్షణకై ఎల్లవేళలా పూర్తి స్థాయిలో సంసిద్ధులై ఉండాలి**





(షణ్ముఖ వెలుగు, డిసెంబర్ 28)

పోలీసులు తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పూర్తి స్థాయి పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫైరింగ్ సాధన ప్రక్రియలో భాగంగా చీమకుర్తి నందు గల జిల్లా ఫైరింగ్ రేంజ్‌లో పోలీసు అధికారులకు నిర్వహించిన వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ సెషన్ ను (తరువాయి 4లో...)

# కేజీబీవీ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే కందుల

**సమస్య ఉంటే నా నెంబర్‌కు ఫోన్ చేయండి**

**సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం**

**అవకతవకలు, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవు**



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 28)

మండలంలోని కలుజువ్వలపాడు గ్రామ పంచాయతీలో గల కేజీబీవీ పాఠశాలలోని హాస్టల్‌ను ఆకస్మికంగా రాత్రి 9 గంటల సమయంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రాత్రి 9 గంటల సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఈ పాఠశాలల పై సోషల్ మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా సమస్యల వలయంలో బాధపడుతున్న బాలికలతో ముచ్చటించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను ధైర్యంగా చెప్పండి లేకపోతే భవిష్యత్తులో రాబోయే విద్యార్థులు ఇంకా గడ్డు పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి విషయాలు రాబట్టారు. దీంతో పాఠశాల సిబ్బంది పై ఆగ్రహించిన ఎమ్మెల్యే అక్కడున్న సిబ్బందితో మాట్లాడుతూ రూముల పరిశుభ్రత, వంట పనులకు బాలికలను ఉపయోగిస్తున్నారని,



పురుగులతో కూడిన అన్నం, పప్పును విద్యార్థులకు వడ్డించడం జరుగుతుందన్న విషయం తమ దృష్టికి వచ్చిందని సిబ్బంది పై ఆగ్రహించారు. ఈ విధంగా పిల్లలకు భోజనాలు పెట్టినట్లయితే వారు అనారోగ్యానికి గురి కాక తప్పదన్నారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులలో సగానికి పైగా విద్యార్థులను విచారించడం జరిగిందన్నారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులందరూ పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే కాబట్టి వారి ఆరోగ్యాలను కూడా కాపాడవలసిన బాధ్యత పాఠశాల సిబ్బంది పై ఉందన్నారు. అంతేకాక బాలికలతోనే చపాతి పిండి కల్పించడం జరుగుతుందన్నారు. వంట మనుషులు సోమరితనానికి అలవాటుపడి విద్యార్థులతో పని చేపించడం ఎంత వరకు సమంజసమని వారిని ప్రశ్నించారు. దీంతో సిబ్బంది బిక్కముఖం వేసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే కందుల జిల్లా కలెక్టర్‌తో విద్యార్థులను మాట్లాడించడం జరిగిందన్నారు. విద్యార్థులతో మాట్లాడి విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సమస్యలను పరిశీలించేందుకు సంబంధిత అధికారిని పాఠశాలకు పంపించి విచారిస్తానన్నారు. విద్యార్థులను ఇబ్బందులు (తరువాయి 4లో...)

# యువనేత విగ్నేష్‌కు బ్రహ్మరథం పట్టిన మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లిఖార్జున

(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 28)



మార్కాపురం ఎమ్మెల్యే కుమారుడు, యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి ఆదివారం పొదిలి పట్టణంలోని మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లిఖార్జున నూతన ఇంటికి చేరుకున్నారు. ఇటీవల నూతన గృహ ప్రవేశం చేసిన జ్యోతి మల్లిఖార్జున యువనేత ఆ సమయంలో విదేశాల్లో ఉండడంతో విదేశాల నుంచి వచ్చిన యువనేత ఆదివారం వారి నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు యువత ఆధ్వర్యంలో కందుల విగ్నేష్‌రెడ్డి కి బంతిపూలు చల్లుతూ, పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించి ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాన రహదారి పై నుండి తన ఇంటి వరకు బంతిపూలు చల్లుతూ ఘనంగా ఆయనకు స్వాగతం పలికారు. ఈ క్రమంలో టపాసులు పేల్చి ఆయనకు బ్రహ్మరథం పట్టారు. అనంతరం ఆయన (తరువాయి 4లో...)

# మృతుల కుటుంబాలకి అండగా ఉంటాం

**మంత్రి డోలా, ఎమ్మెల్యే కందుల**





(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 28)

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర సాంఘీక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. మర్రిపూడి మండలం తంగెళ్ల గ్రామం దగ్గర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డేవిడ్ కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర సాంఘీక, సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పరామర్శించి డేవిడ్‌కు పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెంది పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు చేరిన గుండ్ల సముద్రం గ్రామానికి చెందిన కొల్లా నాగార్జున మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పొదిలి ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆసుపత్రిలో వసతులు సరిగా లేవని తెలుస్తుందన్నారు. త్వరలోనే ఆసుపత్రికి అన్ని వసతులు సమకూర్చి రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, ముల్లా ఖుద్దూస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, మాజీ మండలపార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, జిల్లా టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, తెలుగుయువత మండల (తరువాయి 4లో...)

# వెలిగండ్ల ఎంపిపి టీడీపీలో చేరిక

**వైస్ ఎంపిపి, సర్పంచ్‌తో పాటు 100 కుటుంబాలు చేరిక**


**చంద్రబాబు సమక్షంలో ఇప్పటికే సైకిలెక్కిన కనిగిరి ఎంపిపి**

**పామూరు వైస్ సర్పంచ్ కూడా త్వరలో టీడీపీ తీర్థం**



(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, డిసెంబర్ 28)

కనిగిరి ఎంపిపి డి ప్రకాశం పిసిపల్లి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఆదివారం వెలిగండ్ల మండల వైసీపీ ఎంపిపి రామన మహాలక్ష్మమ్మ ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో అమరావతి గ్రౌండ్‌లో టీడీపీ కండువా కప్పుకున్నారు.వెలిగండ్ల వైస్ ఎంపిపి డాక్టర్ భారతి కూడా టీడీపీలో చేరారు. మాజీ జడ్పీటిసి సభ్యులు రామన తిరుపతిరెడ్డితో పాటు నాగూర్ యాదవ్ మరో 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో టీడీపీలో చేరికలు ఓ పండుగ వాతావరణంలా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. కనిగిరి ప్రాంతం నుండి వలసలు నివారించడమే తన లక్ష్యమన్నారు. గత పదేళ్ళుగా కనిగిరిలో అభివృద్ధి ఆనవాళ్లు లేవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి, యువ నేత నారా లోకేష్‌లు కనిగిరి అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, పల్లాల నారపరెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)



# సూర్యలంక బీచ్ గోల్డెన్ సాండ్స్ చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 28)

ఆదివారం మధ్యాహ్నం బాపట్ల జిల్లా పాండురంగపురం, ఓడరేవు సూర్యలంక బీచ్, గోల్డెన్ సాండ్స్‌కు చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన, బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే నరేంద్రవర్మ రాజు, బాపట్ల ఆర్డీఓ పి గ్లోరియా, డియంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ, డిఎస్పీలు రామాంజనేయులు, జగదీష్ నాయక్, తహశీల్దార్ షేక్ సలీమ, తదితరులు ఉన్నారు.

4



షణ్ముఖ వెలుగు

ePaper www.shanmukhavelugu.com



## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి టీడీపి నాయకుల పరామర్శ

**డివిజన్ అధ్యక్షులు ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం**







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)**

ఒంగోలు నగరంలోని అన్నవరప్పాడు నాలుగో లైన్‌లో శనివారం రాత్రి ఏసీ గ్యాస్ పేలి సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన లక్ష్మణరావు కుటుంబాన్ని టీడీపి నాయకులు ఆదివారం ఉదయం పరామర్శించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆదేశాల మేరకు టీడీపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు బండారు మదన్, క్లస్టర్ ఇన్చార్జి పాలూరి వెంకటేశ్వరరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గడ్డం ఆదినారాయణ, నగర సెక్రెటరీ యలటూరీ రవి, వరలక్ష్మి, తదితరులు పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందో బాధితుడు లక్ష్మణరావును అడిగి తెలుసుకున్నారు. గ్రానైట్ క్వారీలో పనిచేసే లక్ష్మణరావును పార్టీ పరంగా ఆదుకుంటామని తెలిపారు. అనంతరం 15వ డివిజన్ అధ్యక్షులు గడ్డం ఆదినారాయణ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి 15వ డివిజన్ అధ్యక్షులు షేక్ సిద్దిక్ (బబ్లు), ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి గంజిరపల్లి జగదీష్, బూత్ ఇన్చార్జి లక్కవరపు అరుణ, టిడిపి సీనియర్ నాయకులు పాలపర్తి లక్ష్మీనారాయణ, పార్లమెంట్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యాసరపు ఏడుకొండలు, బిసి సెల్ నాయకులు వేణు, మర్రిపూడి శ్రీను, పిన్నిక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ ల్యాండింగ్ మార్చాలని కోరుతూ మంత్రి డీఎస్ బీవీ స్వామికి వినతి పత్రం అందజేత



**(షణ్ముఖ వెలుగు, కొండపి, డిసెంబర్ 28)**

సింగరాయకొండ జాతీయ రహదారి పై కలికివాయి ఫ్లైవోవర్ వద్ద నుంచి కనుమళ్ల రోడ్డు వరకూ 3.6 కి.మీ మేర నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ మరొక చోటకు మార్చాలని కోరుతూ మూలగుంట పాడు, సింగరాయకొండ, కనుమళ్ల, కలికి వాయి గ్రామస్థులు ఆదివారం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని కలసి వినతి పత్రం అందజేశారు. రన్ వే వలన సింగరాయకొండ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని నాలుగు గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే రన్ వే ను మరోచోటకు తరలించాలని వారు మంత్రిని కోరారు. దీని పై మంత్రి స్పందిస్తూ పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.

# వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఆదివారం జిల్లా ఎస్పీ సందర్శించి అక్కడ జరుగుతున్న ఫైరింగ్ ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఫైరింగ్ సాధన ప్రక్రియలో జిల్లా ఎస్పీ పాల్గొని, ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న అధికారుల్లో ఉత్సాహం, మనోధైర్యాన్ని నింపారు. ఈ ఫైరింగ్‌లో ప్రతి అధికారి తప్పనిసరిగా పాల్గొని మంచి మెళకువలు నేర్చుకోవాలని, ఫైరింగ్‌కు సంబంధించి ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఫైరింగ్ రేంజ్‌లో క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యత వహిస్తుందని, ఫైరింగ్ రేంజ్ అధికారుల సూచనల మేరకు అత్యంత జాగ్రత్తగా, ఏకాగ్రతతో ఫైరింగ్ చేయాలన్నారు. ప్రతి ఒక్క బుల్లెట్ లక్ష్యాన్ని ఖచ్చితంగా చేదించే నైపుణ్యం పొందాలని సూచించారు. కొత్తగా వచ్చిన ఆయుధాలపై పూర్తి స్థాయి తర్ఫీదు పొందుతూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల, ప్రభుత్వ ఆస్తుల, ధన మరియు ప్రాణాల రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు అత్యంత కీలకమని, అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి జిల్లా పోలీసు శాఖ ఉన్నతి సాధనలో ఎల్లప్పుడూ ముందడుగు వేయాలని సూచించారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను అభినందించి, రివార్డ్స్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మి నారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వి వి రమణ కుమార్, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, డిటిసి డిఎస్పీ జి గురునాథబాబు, ఎఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.









## వెలిగండ్ల ఎంపిపి టీడీపీలో చేరిక

**టీడీపీలో పెరుగుతున్న "పల్లాల" ప్రభావం**



కనిగిరి నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి ప్రయత్నించిన మాజీ జడ్పీటిసి సభ్యులు పల్లాల నారపరెడ్డి ప్రభావం టిడిపిలో రోజు రోజుకు పెరుగుతుంది. గత వైసీపీ పాలనలో మాజీ జడ్పీటిసి పల్లాల నారపరెడ్డిని వైసీపీ అధిష్టానం పట్టించుకోలేదు. నామినేటెడ్ పదవులు సైతం జనబలం లేని దళారులకు ఇచ్చారని, అప్పట్లో పల్లాల వైసీపీ పార్టీ అధినాయకుల పై కినుకు వహించారు. కనిగిరి నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి ఎంతో కష్టపడ్డారు. హనుమంతునిపాడు, వెలిగండ్ల మండలాల్లో పార్టీ గ్రాఫ్ అనూహ్యంగా పెంచగలిగారు. కానీ వైసీపీ అధిష్టానం ఏ ఒక్క పదవి కూడా ఇవ్వకుండా పల్లాల పట్ల నిర్లక్ష్యం వహించారని ఆయన అనుచరులు అప్పట్లో ఆవేదన వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి గెలుపులో కీలక పాత్ర వహించారు. వెలిగండ్ల, హనుమంతునిపాడు, కనిగిరి, పీసీపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించి ఉగ్ర గెలుపుకు దోహదపడ్డారు. వెలిగండ్ల వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు టీడీపీలో చేరడంలో "పల్లాల" దే కీలక పాత్ర అని చెప్పవచ్చు. టీడీపీ నాయకులతో చర్చించి వైసీపీ నాయకులు టీడీపీలో చేరడంలో పల్లాల పాత్ర ఉందని చెప్పవచ్చు. కనిగిరి నియోజకవర్గంలో వైసీపీ నుండి ఇంకా మరిన్ని వలసలు వస్తాయనే చర్చ జరుగుతోంది. పామూరు మాజీ ఎంపిపి యాదాల శేషారావు కుమారుడు పామూరు మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ యాదాల సాయి జనవరి మొదటి వారంలో టీడీపీలో చేరడం ఖరారైంది. కనిగిరి వైసీపీలో జనబలం లేని నాయకులకు జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు కట్టబెట్టడం వలనే కనిగిరిలో వైసీపీ పార్టీ బలహీనపడుతుందనే విమర్శలున్నాయి.

## మృతుల కుటుంబాలకి అండగా ఉంటాం

అధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, పొదిలి మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, శివాలయం కమిటీ ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## యువనేత విగ్నేష్‌కు బ్రహ్మరథం పట్టిన మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లిఖార్జున

నూతన గృహాన్ని కందుల విగ్నేష్‌రెడ్డి సందర్శించారు. తదుపరి జ్యోతి మల్లిఖార్జున ఆతిథ్యాన్ని స్వీకరించడంతో పలువురు యువ నాయకులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసున్నారు. తనకు చేతనైనంత సహాయాన్ని చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా యువత విగ్నేష్‌రెడ్డితో ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లిఖార్జున, పొదిలి పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ కాలేషా, యర్రమోతు వెంకటేశ్వర్లు, టిడిపి వాణిజ్యవిభాగం పొదిలి పట్టణ అధ్యక్షులు వెంకట్రావు, ఖాదర్, టోని, లోహేంద్ర, రఫి, ఇతర తెలుగుయువత పాల్గొన్నారు.





## కేజీబీవీ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే కందుల









పాలు చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లో క్షమించేది లేదన్నారు. భవిష్యత్తులో ఈ పాఠశాలలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు పాల్పడినా వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే హెచ్చరించారు.

## సూర్యలంక బీచ్ గోల్డెన్ సాండ్స్ చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్



## ప్రాణాయామంతో అద్భుత ఫలితాలు

### చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)**

ప్రాణాయామంతో అనేక అద్భుత ఫలితాలు కలుగుతాయని శారీరక మానసిక ఆరోగ్యం దృఢంగా ఉంటుందని ప్రతి ఒక్కరూ ప్రాణాయామం చేయడం నిత్య జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య పేర్కొన్నారు,ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో శ్రీగిరి గో క్షేత్ర భవన్‌లో ఆదివారం నిర్వహించిన బాలవిహార్ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో పాటు పిల్లలు పెద్దలు ప్రతి ఒక్కరు ప్రాణాయామం చేయవచ్చని వివరించారు. చక్కటి ఆరోగ్య సాధనకు ప్రాణాయామం ఒక సాధనమని పేర్కొన్నారు, తల్లిదండ్రులు ఉదయం సాయంత్రం పిల్లల చేత రామాయణం భారతం భగవద్గీత శ్లోకాలను పలికించడం ద్వారా చక్కటి ఉచ్చారణ అలవడ డంతోపాటు జ్ఞాపకశక్తి మరింత వృద్ధి చెందుతుందని పవిత్ర చైతన్య వివరించారు. విద్యార్థులు భగవద్గీత హనుమాన్ చాలీసా శ్లోకాలను అప్పగించారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు సిబ్బంది కార్యక్రమాలను పర్యవేక్షించారు.



# మార్కాపురం నియోజకవర్గం నుంచి పొదిలి మండలాన్ని వేరు చేయొద్దు

**ప్రభుత్వానికి, కలెక్టర్‌కు విన్నవించిన బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి**

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 28)**

మార్కాపురం నియోజకవర్గం నుంచి పొదిలి మండలాన్ని వేరు చేయవద్దు అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆమె మాట్లాడారు. మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేస్తున్నందుకు మీకందరికీ మా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ మార్కాపురం జిల్లా ఏర్పాటు. నూతన జిల్లా కోసం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ప్రస్తుత మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కన్వీనర్‌గా తెలుగుదేశం, జనసేన, బిజెపి, కాంగ్రెస్, వామ పక్ష పార్టీలు, మేధావులు, విద్యావేత్తలు, వ్యాపార వాణిజ్య సంఘాలు, విద్యార్థి సంఘాల సమన్వయంతో మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి నియోజకవర్గం కలిపి మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటు చేయాలని దాదాపు ఆరు నెలల పాటు అనేక రూపాల్లో నిరాహార దీక్షలతో పోరాటాలు చేసిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన నగ్నసత్యం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా పుట్టినరోజున మార్కాపురం వచ్చినప్పుడు ఇక్కడి ప్రజలకోరిక మేరకు నూతన జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 2024 ఎన్నికల తదుపరి మన ఎన్డీయే కూటమి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన ప్రాథమిక నివేదికలో దర్శి నియోజకవర్గాన్ని విస్మరించి కేవలం మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నాలుగు నియోజకవర్గాలతో కూడిన మార్కాపురం జిల్లాగా పొందుపరుస్తూ ప్రకటన జారీ చేశారు. అనంతరం 2025 డిసెంబర్ నెల 28వ తేదీ వరకు



ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులు స్వీకరించడానికి, దరఖాస్తులు, ఉత్తరాల ద్వారా, వాట్సాప్ మొబైల్ మెసేజ్ ద్వారా అబి ప్రాయములు తెలియ జేయడానికి అవకాశం ఇచ్చారు. ముఖ్యంగా ఈ ప్రాంత అత్యధిక ప్రజల యొక్క మనోగతం అభిప్రాయం ఏమిటి అనగా "దర్శి నియోజకవర్గాన్ని నూతన మార్కాపురం జిల్లాలో చేర్చమని" పొదిలి మండలాన్ని ప్రకాశం జిల్లాలో కలపకుండా మొత్తం మార్కాపురం నియోజక వర్గాన్ని కొత్తగా ఏర్పాటు చేసే మార్కాపురం జిల్లాలో కలపాలని ఈ ప్రాంత అత్యధిక ప్రజల మనోగతం, అభిప్రాయం. దర్శి నియోజకవర్గంలోని దొనకొండ, కురిచేడు, దర్శి మూడు మండలాలతో పాటు పొదిలి మండలం ప్రజలకు, భౌగోళిక, నైసర్గిక, సాంస్కృతిక పరంగా, రహదారుల కనెక్టివిటీ పరంగా మార్కాపురానికి అతి సమీపంలో దగ్గరగా ఉన్నవి. కేవలం ముండ్లమూరు మండలం అద్దంకి నియోజకవర్గానికి,తాళ్లూరు మండలం ఎస్ఎన్‌పాడు నియోజకవర్గానికి సమీపంలో ఉన్నది. కేవలం దర్శి నియోజకవర్గంలోని రెండు మండలాలైన "ముండ్లమూరు - తాళ్లూరు" మండలాలను దృష్టిలో పెట్టుకుని దర్శి నియోజకవర్గం మొత్తాన్ని ప్రకాశం జిల్లాలో ఉంచడం, మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మండలన్ని వేరు చేయడం ఈ ప్రాంత స్థానిక అత్యధిక ప్రజలు (రాజకీయ ఇబ్బందులవలన చెప్పుకోలేక) భాదతో జీర్ణించుకోలేకపోతున్నారు. అంతేగాక కొత్తగా ఏర్పడే మార్కాపురం జిల్లా భవిష్యత్తులో అభివృద్ధి చెందాలంటే...

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయలన్నా ఒకవైపు పశ్చిమాన నల్లమల అడవులు, మార్కాపురం పట్టణంలో డస్ట్ తప్ప ఇతర ఉపయోగపడే వనరులు లేవు... భూవనరుల పరంగా... భౌగోళిక, సాంస్కృతిక, రహదారులు కనెక్టివిటీ "దొనకొండ" మండలంలో ఉన్న వేల ఎకరాల ప్రభుత్వ భూవనరులను, ఇలాంటి అన్ని వనరుల విషయాలను, ప్రజల ఆకాంక్షలను, అనుభావాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా ఏర్పాటు చేయబోయే మార్కాపురం జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని మొత్తం మండలాలతో పాటు మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మండలాన్ని విడదీయకుండా మార్కాపురం జిల్లాలోనే చేర్చగలరని, సాంకేతిక సమస్యలు ఉన్న యెడల కనీసం పొదిలి మండలంతో పాటు దర్శి నియోజకవర్గంలోని దొనకొండ, కురిచేడు మండలాలను చేర్చాలని ప్రజల తరపున తాము సవినయంగా విన్నవించుకుంటున్నామని ఆమె పొదిలి మండల ప్రజల తరుపున తెలిపారు.

# విద్యుత్ కాంతులతో మెరుస్తున్న ఒంగోలు నగరం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)**

విద్యుత్ దీపాలతో ఒంగోలు నగరం ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తోంది. నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాలు రానున్న సందర్భంగా నగరాన్ని విద్యుత్ దీపాలతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. కలెక్టర్ కార్యాలయం నుంచి రామ్ నగర్ వరకు అలాగే కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు అన్ని రహదారుల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయగా నగరం విద్యుత్ కాంతులతో విరాజిల్లుతోంది.















# యుటీఎఫ్ మార్కాపురం జిల్లా కార్యదర్శిగా డాక్టర్ మొర్రి పిచ్చయ్య ఏకగ్రీవ ఎన్నిక

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, డిసెంబర్ 28)**



ఒంగోలు లోని టి.టి.డి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 51వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మార్కాపురం జిల్లా కార్యదర్శిగా కొమరోలు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లినగరంలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యను కొమరోలు, రాచర్ల, గిద్దలూరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్, జిల్లా కార్యదర్శి, మూడు మండలాల జిల్లా కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించి పేరు ప్రతిపాదించగా జిల్లా ఎన్నికల కమిటీ అధికారి కొమ్మొజు శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఆమోదించి ప్రకటించారు. వీరు గిద్దలూరు డివిజన్ పరిధిలోని రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాల పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలను, సంఘ బలోపేతంకు కృషి చేయవలసి ఉంటుంది. ఈ కార్యక్రమంలో గిద్దలూరు డివిజన్ రాష్ట్ర కౌన్సిలర్ పి రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి యం సత్యనారాయణరెడ్డి, మూడు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొని మార్కాపురం జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన యం పిచ్చయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. తనను ఎన్నుకున్న జిల్లా కౌన్సిలర్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. తన పేరును ప్రతిపాదించిన మూడు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, జిల్లా కార్యదర్శికి, రాష్ట్ర కౌన్సిలర్‌కు, సంఘ నాయకులకు, సలహాదారులకు ధన్యవాదాలు తెలియజేశారు.




# 2026 జనవరి నెల పెన్షన్లు డిసెంబర్ 31న పంపిణీ

**జిల్లాలో 2,25,485 మందికి వివిధ రకాల పింఛన్లు రూ.96.57 కోట్లు**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్**



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 28)**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న యన్‌టిఆర్ భరోసా ఫించన్లు డిసెంబర్ 31న పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026 జనవరి 1వ తేదీ (నూతన సంవత్సరం కారణంగా) 2026 జనవరి 1న పంపిణి చేయవలసిన పెన్షన్లును ఈ నెల 31న బుధవారం ఉదయం 7 గంటల నుండి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాపట్ల జిల్లాలో జనవరి 2026 నెలలో 2,25,485 మందికి వివిధ రకాల పొందుతున్న ఫించన్ దారులకు రూ.96.57 కోట్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 30 న సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుండి నగదు డ్రా చేసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ఈ నెల 31 నే వంద శాతం పెంచన్లు పంపిణీ చేయుటకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని అనివార్య కారణాల చేత 31న తీసుకోని వారికి 2 వ తేదీ న పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)**

విద్య హక్కు ప్రతి ఒక్కరికి అందాలనే లక్ష్యంతో రాత్రుల బడి కార్యక్రమంను మలబార్ గోల్డ్ - సంస్థల సహకారంతో ఒంగోలు పట్టణంలోని నగర కార్పొరేషన్ పరిధిలో తుఫాన్ నగర్, పిర్లమాన్యం, మదర్ తెరిసా కాలనీ, సరళ దేవినగర్, నేతాజీ కాలనీ, తుఫాన్ నగర్ లలోని పిల్లలు పగటి వేళలలో స్కూల్స్ కు వెల్లిన, మరల విద్యకు దూరమైన యువత కార్మికుల, మహిళలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మలబార్ గోల్డ్ ప్రతినిధి షేక్ జమీర్ అన్నారు. పీర్ల మాన్యం లోని మైక్రో లెర్నింగ్ సెంటర్ ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా ఏరియా కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతు చదువు మధ్యలో మానేసిన వారికి ప్రాథమిక విద్యతో పాటు అక్షరాస్యత, జీవన నైపుణ్యల పై అవగ్రహణ పిల్లలకు కల్పించినట్లు, అనుభవ ఉపాధ్యాయులు ద్వారా సాయంత్రం వేళల్లో తరగతులు నిర్ణయించబడతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏవిఏ బంగారు బాల్యం %ణూూ%. పి. సిద్ధిక్ మాట్లాడుతు రాత్రుల బడి ప్రాధాన్యతను వివరిస్తూ చదువు ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని వారు అన్నారు. ప్రతి విద్యార్థి, విద్యార్థులు విద్యకు దూరం కాకుండ క్రమం తప్పక రాత్రుల బడి ద్వారా విద్యను అందుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తనల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎం. వంశీకృష్ణ మాట్లాడుతూ విద్య, వైద్య, సామాజిక అభివృద్ధి కొరకు మా సంస్థ అనేక ప్రాంతంలో ఒకసారి వచ్చి పనిచేస్తుంది ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జువ్వెనల్ లీగల్ డ్రింకింగ్ కె రత్న ప్రసాద్, కాలనీ పెద్దలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## 30వ తేదీ శ్రీ ప్రసన్న చెన్నకేశవ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)

ఒంగోలులోని కేశవ స్వామి పేట లో శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం నందు శ్రీ వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు కార్య నిర్వహణ అధికారి రావెళ్ల శివశంకర్ తెలిపారు. శుద్ధ ఏకాదశి మంగళవారం 30 -12 -2025, వైకుంఠ ఏకాదశి శుభ సందర్భమున శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి వారికి తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వారా దర్శనం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఉత్తర ద్వారంలోని నారాయణుని దర్శనం చేసుకుంటే పుణ్యఫలము కలిగి సిరిసంపదలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, సతీమణి నాగసత్యలత పాల్గొంటారని, విశిష్ట అతిథులుగా ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొంటారన్నారు. 17-12-2025వ తేదీ బుధవారం నుండి 14-01-2026 బుధవారం వరకు ధనుర్మాసం సందర్భంగా ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి డాక్టర్ రామచంద్రుని రమేష్ కృష్ణచే తిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30వ తేదీ మధ్యాహ్నం స్వామివారి గరుడ సేవ నగరోత్సవంలో ఉత్తర ద్వార దర్శనన్ని భక్తులు దర్శనం చేసుకొని కార్యక్రమంలో పాల్గొని భక్తులు ప్రసాదాలు స్వీకరించాలని రావెళ్ల శివశంకర్ తెలిపారు.

# సక్షమ్ ఒంగోలు జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా దివ్యాంగుల సమ్మేళనం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)

సక్షమ్ ఒంగోలు జిల్లా ఆధ్వర్యంలో దివ్యాంగుల సమ్మేళనం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమ్మేళనానికి జిల్లా నలుమూలల నుంచి సుమారు 230 మంది దివ్యాంగులు హాజరై తమ ఐక్యతను చాటారు. కార్యక్రమం ప్రారంభంలో దివ్యాంగులు ఏకేవీకే కాలేజీ నుంచి సుందరయ్య భవన్ రోడ్డుమీదుగా, కర్నూల్ రోడ్డు, లంబాడీ డొంక మార్గంగా శోభాయాత్ర, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. "సక్షమ్ భారత్ , సమర్థ భారత్" వంటి ఉత్సాహభరిత నినాదాలతో శోభాయాత్ర నలుమూలల ప్రజలను ఆకర్షించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి విప్పర్ల విజయ రామారావు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా సక్ష్యం చేస్తున్నటువంటి వివిధ కార్యక్రమాలను విశదీకరించారు సక్ష్యం చేస్తున్నటువంటి ఏడు కార్యక్రమాలను వివరించారు. గౌరవ అతిథులుగా మారేళ్ల సుబ్బారావు మాట్లాడుతూ మానవతా సేవా సమితి తరపున సక్ష్యంకి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. టీడీపీ దివ్యాంగ విభాగం అధ్యక్షులు సాయి జనార్ధన్ సమాచార హక్కు చట్టం గురించి దివ్యాంగులకు వివరించారు. వడ్డంపూడి సుజాత మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల సానుభూతి లేని వారు దివ్యాంగులని వీరిలో విశేషమైనటువంటి ప్రతిభ పాటవాలు ఉన్నాయన్నారు. దృష్టి బాధితుడు శ్రీ కోటా ప్రభు (అసిస్టెంట్ మేనేజర్, యూనియన్ బ్యాంక్) మాట్లాడుతూ దృష్టి బాధితుడైన నేను మార్గదర్శకంగా ఉండాలని ఈ కార్యక్రమానికి ఆహ్వానించి సహా సహకారాలు అందించిన సక్ష్యం వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఎం వి రమణారెడ్డి మోడరన్ ఐ హాస్పిటల్ వారు మాట్లాడుతూ సక్షమ్ చేస్తున్న విశేష సేవలను అభినందించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ డి రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలు గురించి వివరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ మనము దివ్యాంగులమని నిరాశ పడరాదని ఉదాహరణకు ఆర్తి డోగ్రే మూడు అడుగులుగా మూడు అంగుళాల ఐఏఎస్ అధికారిని దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆమె సేవలను గుర్తించారు. మనం ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కందుకూరు రెడ్ క్రాస్ రక్తదాత చెన్నరామాంజనేయులు మాట్లాడుతూ 103 మందికి నేత్రదానం చేయించి 206 మందికి చూపు రప్పించిన విషయాన్ని తెలియజేశారు. జిల్లా కార్యదర్శి అంజిరెడ్డి దివ్యాంగుల హక్కులు, గౌరవం, స్వావలంబన, సంక్షేమ పథకాల అమలు పై విలువైన సూచనలు చేశారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని సక్షమ్ ఒంగోలు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కందిమల్ల పూర్ణచంద్రరావు సమర్థవంతంగా నిర్వహించారు. చివరగా ఈ కార్యక్రమంలో వినికిడి లోపంతో బాధపడే 20 మందికి, వినికిడి యంత్రాలను ఇవ్వడం జరిగింది. ఒకరికి వీల్ చైర్, మరొకరికి రూ.40 వేల విలువ చేసే బ్యాటరీ సైకిల్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఉమామ మనో వికాస కేంద్రం మానసిక దివ్యాంగులు, అలాగనే స్వర్ణ బ్లైండ్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, మోహన్‌రావు, కొత్తపట్నం నుండి వివిధ రకాలైన దివ్యాంగులు, సక్షమ్ దివ్యాంగు సేవా కేంద్రం పి కుమారి, చీమకుర్తి ఎస్ కే ఆర్ చెవిటి, మూగ పిల్లల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ కందిమల్ల పూర్ణచంద్రరావుని సన్మానించుకోవడం జరిగిందని సురేష్‌రెడ్డి, సంధాని, విద్యాసాగర్ తెలియజేశారు.




# ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**జిల్లా పార్టీ కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా**
**పార్టీ సీనియర్లను శాలువాలు, పూలదండలతో సత్కరించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141 వ ఆవిర్భావ దినోత్సవం ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ఆధ్వర్యంలో నేడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయం వద్ద పార్టీ పెద్దలతో కలిసి షేక్ సైదా కాంగ్రెస్ పార్టీ పతా కాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం అలుపెరగని పోరాటం నడిపి దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించిన కాంగ్రెస్ పార్టీ మహోత్సవాలమైన చరిత్ర గలదన్నారు. ఈ దేశాన్ని 55 సంవత్సరాలు పాటు సుదీర్ఘంగా పరిపాలించి, దేశ సమైక్యతను, సమగ్రతను కాపాడిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఆయన కోరారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం మాట్లాడుతూ తాను 45 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి అనేక సేవలు అందించానని, పార్టీ కూడా తనను గౌరవించి అనేక పదవులు కట్టబెట్టిందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు.

### పార్టీ సీనియర్లకు సత్కారం

కాంగ్రెస్ పార్టీ 141 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జిల్లాలోని పలువురు సీనియర్ పార్టీ నాయకులను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా ఇతర నేతలతో కలిసి పూలదండలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారిలో శ్రీపతి ప్రకాశం, షేక్ రసూల్, టాటా శ్రీనివాసరావు, కాకర్ల పూడి వేణు రాజు, మన్నం ప్రసన్న రాజు, బొడ్డు



సతీష్, బలసాని కోటేశ్వరరావు, కొప్పోలు సుబ్బారావు, కే ఎన్ ప్రసాద్, రమణారెడ్డి, షేక్ రవూఫ్, రమణారెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కేకేసి ప్రధాన కార్యదర్శి టి సుధీర్ వర్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్య క్షులు గోరంట్ల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు ఇరిగినేని వెంకట నరసయ్య, పయనం మధు, జాకబ్, శ్రీనివాసరాజు, జిల్లా మైనార్టీ నాయ కులు షేక్ అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

### సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాంగ్రెసులో చేరిక

ఒంగోలు పట్టణానికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఖరీదు వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ ఆశయాలకు సిద్ధాంతాలకు ఆకర్షితులై రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కావాలని ఆకాంక్షించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.





# బద్వేల్ లో ఘనంగా హిందూ సమ్మేళనం ఒక్కసారిగా పట్టణంలో కదం తొక్కిన హిందువులు











(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 28)

ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తియైన సందర్భంగా శత జయంతి ఉత్సవాలు దేశములోని అన్ని జిల్లాలు, మండలాల్లో విశేషంగా జరుపుకుంటున్న సందర్భంగా బద్వేలు సంఘ మండలంలో భాగంగా బద్వేలులోని నెల్లూరు రోడ్డులోని శ్రీ రాఘవేంద్ర గ్రాండ్ కల్యాణ మండపంలో ఆదివారం హిందూ సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ హిందూ సమ్మేళనానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు శ్రీశ్రీశ్రీ విరజానంద స్వామీజీ అచలానంద ఆశ్రమం తోట్లపల్లి నుంచి, ప్రధాన వక్తగా ఆర్ఎస్ఎస్ జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ రామిడి జైపాల్‌రెడ్డి, ముఖ్య అతిథిగా ప్రముఖ కాంట్రాక్టర్, ఏపీఐఐసీ డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి, మహిళా వక్తగా వెలిగల ధనలక్ష్మి , జిల్లా సేవికా సమితి, హిందూ సమ్మేళన కార్యక్రమం అధ్యక్షులుగా పెరుగు వెంకటయ్య, విశిష్ట అతిథిగా బిజెపి జిల్లా కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి గౌరవాధ్యక్షులు చెన్నమరాజు రామకోటి రాజు ల ఆధ్వర్యంలో హిందూ బంధువుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విరజానంద స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ ధర్మం కోసం చత్రపతి శివాజీ లాగా, వివేకానందుడిలాగా ధర్మ పోరాటం చేయాలని, హిందువులందరూ పులులైనప్పటికీ మేకల్లాగా కలిసిపోయి తిరిగుతూ బతుకుతున్నారని వాపోయారు. ప్రస్తుత కాలంలో హిందువులందరూ చైతన్యమై మన ధర్మాన్ని, మతాన్ని ఆలయాల నిర్వహణను ఆలయ భూములను అన్యాకాంతం కాకుండా మన దేశం పూర్వ వైభవ స్థితికి, అఖండ దేశంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పాటుపడాలని ఇందులో మహిళా మాతృమూర్తులు దేశభక్తులను తయారు చేసే సంకల్పం తీసుకోవాలని అందరితో కలసి ఆర్ఎస్ఎస్ కోసం సంఘం కోసం తమ పిల్లలను శిక్షణ కోసం పంపిస్తామని ప్రమాణం చేపించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని ఇందులో ఎంతోమంది తన జీవితం కాలం సేవ చేసేందుకు ముందుకు వచ్చారని ఎంతో సేవాభావంతో దేశ కార్యం కోసం మనసా, వాచా, కర్మణా పనిచేస్తూ దేశ సేవలో తరిస్తున్నారని తెలియజేశారు. బద్వేల్ లోని ప్రతి కుటుంబం నుంచి ఒకరు ఆర్ఎస్ఎస్ శిక్షణ కొరకు పంపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సరస్వతి శిశు మందిరం మాజీ అధ్యక్షులు కొండపల్లి సుభాష్ కుమార్ , ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు సాకి ఈశ్వరయ్య, అక్కి సంజీవరెడ్డి, అక్కి రాజశేఖర్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ బద్వేల్ ప్రఖండ మరియు శ్రీ సరస్వతి శిశు మందిరం బద్వేల్ ప్రధాన కార్యదర్శి పెద్ది సుధాకర్ , బోరెడ్డి రఘునాథ రెడ్డి, అంబవరం వేణుగోపాల్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ కడప జిల్లా సహకార్యదర్శి శ్రీ పత్తిపాటి నరసింహులు, పోకూరు తిరుపాలయ్య, బిజెపి కడప జిల్లా ఉపాధ్యక్షులు రామసుబ్బారెడ్డి, బద్వేల్ బిజెపి పరిశీలకులు ఉట్టి శ్రీనివాసులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ బీజేవైఎం జిల్లా కార్యదర్శి అశోక్ కుమార్ రెడ్డి, బద్వేల్ బిజెపి పట్టణ అధ్యక్షులు దర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి ముఖం శ్రీనివాస్ రాయల్, బిజెపి సీనియర్ నాయకులు కుప్పాల నరసింహులు, వనం నరసింహులు, ఓంకార క్షేత్ర నిర్వాహకులు శంబు ప్రసాద్ , గంగసాని సాంబశివ రెడ్డి , పల్లంశెట్టి శ్రీనివాసులు, ఏపీయూజేడబ్ల్యూజే యూనియన్ అధ్యక్షులు భూమిరెడ్డి వెంకటేష్,యర్రం రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, వి. వి.రమణ,కాలువ చెన్నయ్య, సునీల్, నరసింహ, సుధాకర్,సిరిగిరి వెంకటేష్, పబ్బతి సత్య నారాయణ,మాలే కొండ రెడ్డి, అడ్వకేట్ మువ్వా నరసింహులు, బాసికాల శ్రీనివాసులు, ఆర్యవైశ్య వర్తక సంఘం ఉపాధ్యక్షులు దర్శి సుబ్బరాజా, యాదల్ల కృష్ణమూర్తి, సూరే వెంకటసుబ్బయ్య, చిన్ని నరసింహ, దిండుకుర్తి సుబ్బరాయుడు, పసుపుల రవిశంకర్, గుబ్బ వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ సుధాకర్, తుమ్మలపంట సురేష్, బాబు తులసి వెంకట శివ నారాయణ, పైడిమర్రి సురేష్ బాబు, చిందుకూరి శివ, సోల్లెటి సుబ్బరాజా, మాచుపల్లి కృష్ణారెడ్డి, నిమ్మకాయల గోపాల్ రెడ్డి, చింతకుంట ధనలక్ష్మి, ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ సెక్రటరీ కూరాకు వెంకటసుబ్బయ్య, రాజు,గంగసాని సాంబ శివా రెడ్డి, మదల్లపల్లె గోపాల్, తోట రాము, బిజెపి సీనియర్ నాయకులు కొలిశెట్టి రమణయ్య, పవన్, చింతకుంట చెన్నకృష్ణ నాగరాజా,అమరా జనార్దన్ రావు, బయనబోయిన శివ, ఇరగబోయిన చంద్ర, సంద్ర సునీల్, కుంభగిరి రవిశంకర్, నూనె శ్రీరాములు, సింగసాని కిరణ్ కుమార్, అనాల నరసింహ ప్రసాద్, మేడం రాజేష్, చెన్నమ్మరాజు ఈశ్వర్ పృధ్విరాజ్ మరియు వందలాది హిందూ బంధువులు విశ్వహిందూ పరిషత్ ఆర్ఎస్ఎస్ బజరంగ్గ దళ్, హిందూ సంఘాల కార్యకర్తలు మహిళ మాతృమూర్తులు పాల్గొని హిందూ సంఘం కొరకు పాటు పాడుతామని ప్రతిజ్ఞ చేశారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 28)

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం తర్లుపాడు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఐఎన్‌సీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే, ఏపీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించారు. సుదీర్ఘ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర కలిగిన, దేశం, రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా తర్లుపాడు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తర్లుపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ పాత్ర అనిర్వచనీయమని, రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహానా బాను, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అబ్దుల్లా, షేక్ ఖాసిం, షేక్ రబ్బానీ, ఇమ్రాన్, షేక్ అల్తాఫ్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అదేవిధంగా, జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ భారతదేశ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టడం పార్టీకి గర్వకారణమని, ఆయన హాజరై ఉంటే కార్యక్రమం మరింత ఘనంగా జరిగేదని తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

## నవోదయలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)

జవహర్ నవోదయ విద్యాలయం నందు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. నవోదయలో 6 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు పూర్తి చేసిన వివిధ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి, తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో, విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, తమను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకొని వారి యొక్క తరగతి గదిలో, హాస్టల్ లో జరిగిన అనుభవాలు నెమరు వేసుకున్నారు, ఈ సందర్భంగా, పూర్వ విద్యార్థులు తమ జీవితంలో సాధించిన విజయాలను పంచుకున్నారు, అలాగే పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విద్యాలయ ప్రిన్సిపాల్ సి. శివరాం హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈ సమ్మేళనం విద్యార్థుల మధ్య సత్సంబంధాలను పెంచడమే గాక, తమను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన గురువుల పట్ల కృతజ్ఞతను చాటుకునే గొప్ప అవకాశాన్ని కల్పించిందని తెలిపారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, నవోదయ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చంద్రన్న మార్కాపురం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి









(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 28)

వైకాపా ప్రభుత్వ హయాంలో పశ్చిమ ప్రాంత అభివృద్ధి శూన్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం జిల్లాను ప్రకటించడం పట్ల మార్కాపురం పురపాలక సంఘంలోని 3వ వార్డ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా కాలంలో పశ్చిమ ప్రాంతానికి వరగబెట్టిందేమీ లేదన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన వైకాపా పూర్తి చేయకుండానే అంకితం చేశామంటూ మోసం చేశారన్నారు. వైకాపా హయాంలో 29 ప్రభుత్వ పథకాలకు జగన్ పేరు పెట్టి అమలు చేశారని, అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రాంత వెనుకబాటును గుర్తించి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రన్న పేరును మార్కాపురం జిల్లాకు పెడితే తప్పేంటని ప్రశ్నించారు. జీవించి ఉన్న జగన్ పేరు పెట్టినప్పుడు, చంద్రన్న పేరుకు అభ్యంతరం ఏంటని విమర్శించారు. మార్కాపురం జిల్లా ప్రకటనతో పశ్చిమ ప్రాంతంలో ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు అన్నారు. టిడిపి తీసుకున్న నిర్ణయాన్ని ఓరవలేకనే విమర్శలు చేస్తున్నారన్నారు. త్వరలోనే చంద్రన్న మార్కాపురం జిల్లాను అభివృద్ధి పదంలో నడుపుతామన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రకాశం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.వైకాపా హయాములో రాష్ట్రము దివాలా తీసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంద అన్నారు. ఓట్లు దండుకొని వైకాపా ప్రభుత్వం మార్కాపురం జిల్లా ఇవ్వకుండా వివక్షత చూపిందని, ఎన్నికలు ఇచ్చిన వాగ్దాన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు మార్కాపురం జిల్లాను ప్రకటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా చంద్రబాబు నిలిచిపోయారన్నారు. దోచుకోవడం దాచుకోవడం మినహా రాష్ట్ర అభివృద్ధి కోసం వైకాపా చేసింది శూన్యమన్నారు. వెలుగొండ ప్రాజెక్టును కూడా త్వరలో పూర్తిచేసి పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేరుస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. చెప్పిన మాటకు కట్టుబడి నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. తన హయాంలో జిల్లా రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రజా మద్దతుతో పశ్చిమ ప్రాంత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు ప్రతి కార్యకర్తకు తోడుగా నిలుస్తానని, పేద ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తానని స్పష్టం చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి పూల వర్షంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి వార్డు ప్రజలు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో, తెలుగుదేశం నాయకులు ఎన్డీఏ కూటమి నాయకులు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదర్ భాషాకి నివాళులు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 28)**

రిటైర్డ్ ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదర్ భాషా బ్రెయిన్ స్ట్రోక్‌తో ఈరోజు ఉదయం మరణించారు. వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొదిలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ బాదుల్లా, ప్రధాన కార్యదర్శి షేక్ మదార్ వలి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కె ఎలమందరెడ్డి, దాసరి గురుస్వామి, కేజే మోహన్‌రావు, డివి సుబ్బారావు, తదితరులు వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని తెలియజేశారు. మృతుడు షేక్ ఖాదర్ బాషా అంతిమయాత్రకు మానవతా సేవా సంస్థ ద్వారా వాహనము ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పొదిలి మానవతా సేవా సంస్థకు, పెన్షనర్స్ అసోసియేషన్ వారికి అభినందనలు తెలిపారు.

# ఏపీజేఏసీ అమరావతి ఆవిర్భావ మహాజన సభను జయప్రదం చేయండి

### వేలాదిగా తరలివచ్చి ఐక్యతను చాటుదాం
### ఉద్యోగుల సమస్యలపై ఏపీజేఏసీ అమరావతి నిరంతరం పోరాటం
### ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)**

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న ఏపీజేఏసీ అమరావతి ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు చేపట్టిన జిల్లాల పర్యటనలో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలు, ఎన్టీఆర్ కళాక్షేత్రం నందు ఏపీజేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదన్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ శ్రీ బొప్పరాజు వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేరాజు, వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయ కుమార్, ఉమెన్ అసోసియేట్ స్టేట్ చైర్ పర్సన్ సైకం శివకుమారి రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు వి. ఆర్లయ్య, క్లాస్-5 ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు మల్లేశ్వరరావు, వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అనుపమ, ప్రకాశం జిల్లా మహిళా చైర్ పర్సన్ జయలక్ష్మి, జనరల్ సెక్రెటరీ , శ్రీదేవి, అసోసియేషన్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వరంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీజేఏసీ అమరావతి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఏపీజేఏసీ అమరావతిలో వ్యక్తుల ప్రాధాన్యత ఉండదని, సంఘాల ద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కరించడం ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఏపీజేఏసీ అమరావతిలో ఉన్న 94 సంఘాలలో, 78 సంఘాలు రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో ప్రభుత్వానికి ఉద్యోగులకు మధ్య వారధిలా పనిచేస్తున్నాయన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన ఏపీజేఏసీ అమరావతి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రాష్ట్ర "మహాజనసభ" కు ఉద్యోగులు వేలాదిగా హాజరై జయప్రదం చేయడం ద్వారా ఉద్యోగుల ఐక్యతను చాటాలన్నారు. అందులో భాగంగానే జిల్లాల పర్యటనలో భాగంగా నేడు ఒంగోలు రావడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వంలో రెండు సంవత్సరాలుగా అనేక రకాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తున్నామని, అందుకు సంబంధించిన కార్యాచరణను రాష్ట్ర మహాజన సభలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన ఐఆర్, పీఆర్సీ, డీఏ తదితర ఆర్థికపరమైన సమస్యలను ప్రభుత్వం తీర్చే విధంగా మనమందరం ఐక్యతగా ప్రభుత్వానికి తెలియ చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదన్‌రావు, అసోసియేటెడ్ చైర్మన్ కృష్ణమోహన్, ట్రెజరర్ కుమార్, వైస్ చైర్మన్లు బెజవాడ రవి, తిరుపతి స్వామి, ప్రసన్నాంజనేయ కుమార్, వెంకట్రావు, పద్మ, వెంకటేశ్వర్లు, రమేష్ బాబు, జనరల్ సెక్రటరీ పోలయ్య, సెక్రటరీలు శిరీష్ బాబు, అబ్దుల్లా, ప్రశాంత్ నాయుడు, రాజేష్ బాబు, వెంకటేశ్వరరాజు, వైస్ చైర్మన్ ఊతకోలు శ్రీనివాసరావు, సెక్రటరీ శ్రీనివాస వర్మ, వైస్ చైర్మన్ విశ్వరూపాచారి, సెక్రటరీలు జానయ్య, శ్రీనివాసరావు, బాలకృష్ణ, బాలాజీ, లావణ్య, సుబ్రహ్మణ్యం, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

### యుటిఎఫ్ నేతలు






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 28)**

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నేతలు కోరారు. ప్రకాశం జిల్లా 51వ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన ఒంగోలు టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయులకు 12వ పిఆర్సి కమిషన్‌ను వెంటనే వేయాలని, ఆర్థిక బకాయిలకు సంబంధించిన రూట్ మ్యాప్ ప్రకటించాలని, 11వ పిఆర్సి బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల రంగాన్ని ఉపాధ్యాయులు ఒక గంట అదనంగా పనిచేసి కాపాడుకోవాలని, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, భవిష్యత్తులో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం సంఘం పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని తెలియజేశారు. తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలకు మాత్రమే వర్తింపజేయాలని, తెలుగు, ఇంగ్లీష్ మీడియం సమాంగా ప్రవేశపెట్టాలని టెట్ పరీక్షలు ప్రభుత్వ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని, జెడ్పి పిఎఫ్ కార్యాలయంలో నెలల తరబడి నోచుకొని బిల్లులు చెల్లించాలని, మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. విద్యాహక్కు చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మహిళా ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ లీవ్‌ను, హెల్త్ కార్డ్ ద్వారా నాణ్యమైన నగదు రహిత వైద్యం అందించాలని, ఉపాధ్యాయులందరికీ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారమే పాఠశాల నిర్వహించాలని, విద్య పాలన పరంగా రాష్ట్ర, కేంద్ర కరణను ఆపాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. 51వ కౌన్సిల్ సమావేశంలో నూతన ప్రకాశం జిల్లా, మార్కాపురం జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ, నవ కోటేశ్వరరావు హాజరై నూతన కమిటీ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ప్రకాశం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కిలారి వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ హై, మార్కాపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా షేక్ ఖాజా రహమతుల్లా, ఓవి వీరారెడ్డి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు పర్యవేక్షించారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, జివి శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.









# రెవెన్యూ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు , డిసెంబర్ 28)**

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. ఈ దిశగా ప్రతి సోమవారం కలెక్టరేట్లో జరిగే ' మీకోసం ' కార్యక్రమంలో ప్రత్యేకముగా ' రెవెన్యూ క్లినిక్ ' ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఈనెల 29వ తేదీ నుంచి ' మీకోసం ' కార్యక్రమంలో రెవెన్యూ అంశాలకు సంబంధించి వచ్చే అర్జీల పరిష్కారానికి ఐదు ప్రత్యేక టేబుళ్ళు ఏర్పాటు చేస్తారు. ఈ విధంగా ఆర్.ఓ.ఆర్, పాస్ పుస్తకము, ఆర్.ఓ.ఎఫ్.ఆర్, ఏజెన్సీ భూములు, రీ సర్వే టేబుళ్లు ఏర్పాటు చేసి సంబంధిత రికార్డును కూడా అందుబాటులో ఉంచుతారు. రెవెన్యూ క్లినిక్ లో ప్రత్యేకంగా రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అందులోని సిబ్బంది అర్జీదారుతో మాట్లాడి సమస్య ఏమిటో తెలుసుకుని సంబంధిత టేబుల్ వద్దకు అర్జీదారును పంపుతారు. అన్ని పరిశీలించాక భూమి స్వభావము, సమస్య, దాని పరిష్కారానికి చేపట్టే కార్యాచరణ ( ఏ.టి.టి )తో కూడిన రిపోర్టును అర్జీదారుకు అందజేస్తారు. ఒకవేళ సమస్య సివిల్ అంశానికి సంబంధించినది అయితే న్యాయపరమైన సలహా కూడా అందిస్తారు. రెవెన్యూ క్లినిక్ కు వచ్చే తీవ్రమైన అంశాలు, న్యాయపరమైన వ్యవహారాలపై జాయింట్ కలెక్టర్, ఆర్డిఓ, తాసిల్దార్ స్థాయిలో చర్చలు జరిపి పరిష్కారం చూపుతారు. ప్రతిరోజూ ఉదయం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఈ రెవెన్యూ క్లినిక్ పిటిషన్లపై సమీక్షిస్తారని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులు సరైన చర్య తీసుకున్నారని నిర్ధారించుకున్నాకే ఈ పిటిషన్ ను ముగిస్తామని కలెక్టర్ తెలిపారు. రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ విధంగా ప్రత్యేక దృష్టి సారించినందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com